కొలువుదీరిన దుర్గాభవానీ

• వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం


బాలత్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు


కళింగనగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, తదితరులు


బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు


47వ వార్డులో బాల త్రిపుర సుందరీదేవిగా దుర్గాదేవి


సీతంపేటలో మహాలక్ష్మి అలంకరణలో పార్వతీదేవి

సీతంపేట : దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఉత్తర నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు, ప్రధాన రహదారులు, కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లలితా అమ్మవారికి ఉదయం 4 గంటలకు పంచామృత అభిషేకం, అర్చన, బాలభోగం నివేదన చేశారు. పీఠం దర్బారు హాలులో లలితాకామేశ్వరుల విగ్రహాలు ప్రతిష్ఠించి, పండితుల వేద మంత్రాల మధ్య ఉత్సవాలు ప్రారంభించారు. మధ్యాహ్నం పీఠంలో అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం గోపూజ, శ్రీచక్రనవావరణ, లలితాసహస్రనామార్చన, కుంకుమార్చన చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మహాలక్ష్మి షడక్షరి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- సీతంపేటలో రాధాకృష్ణయూత్ ఆధ్వర్యంలో రాధాకృష్ణ ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. పండితుల వేద మంత్రాల మధ్య విగ్రహం, కలశ ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

మహాలక్ష్మి అలంకరణలో పార్వతీదేవి...

సీతంపేట : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి గురువారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, మహాలక్ష్మి నామార్చన, చండీ హోమం జరిపారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితాపారాయణ చేశారు. శుక్రవారం గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీ మహా గణపతి ప్రసన్న వేంకటేశ్వర అయ్యప్ప షిరిడీ సాయిబాబా దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అమ్మవారి విగ్రహం గురువారం ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఈవో ప్రసాద్ తెలిపారు. తొలిరోజు బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక అన్నదానం ప్రారంభించారు. అలాగే శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవాని పాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొలి రోజు భక్తులకు స్వర్ణ కవచ దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. నిర్వాహకులు బండారు గుప్తాజీ మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా అమ్మవారు శుక్రవారం బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారని తెలిపారు. 14న సాయంత్రం భారీ ఊరేగింపుతో నిమజ్జనోత్సవం నిర్వహిస్తామన్నారు.

అప్పలరాజు, రాజేష్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుర్గారెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన త్రీ డీ పాము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బాల త్రిపురసుందరి దేవిగా దుర్గమ్మ

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా పరిధి బాపూజీనగర్‌లో జై సంతోషిమాత ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. భవానీ భక్తుల మాల ధారణతో ఆలయం మార్మోగింది. దుర్గాదేవిని బాల త్రిపురసుందరి దేవిగా అలంకరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనువాసరావు, ప్రధాన అర్చకులు సూర్య ప్రకాష్ శర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు చేశారు.

- జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం మధుసూధన్‌నగర్‌లో లక్ష్మీ గణపతి సహిత కనక దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. దుర్గమ్మను బాల లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శంకర్, లక్ష్మి దంపతులు పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాస్ శర్మ, పరమానందరావు కుంకుమ పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అప్పారావు, వెంకటరావు, ఈశ్వరరావు, ఇరోతి ఈశ్వరరావు, పైడిరాజు, రాంబాబు, సత్యవతి, కవిత, శశి, సూకరత్నం, నాగమణి, శోభన, హైమా పాల్గొన్నారు.

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ జంక్షన్ వద్ద శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని ఆయన కోరారు.

- మాధవధార సీతన్న గార్డెన్స్‌లో శ్రీకనక మహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గా దేవి ఆలయంలో గురువారం అమ్మవారు బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.


సీతంపేటలో అమ్మవారి సన్నిధిలో రాధాకృష్ణ యూత్ సభ్యులు


లలితాపీఠంలో కలశస్థాపన చేస్తున్న వేద పండితులు


శ్రీలలితాపీఠంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


104 ఏరియా బాపూజీనగర్‌లో భవానీ భక్తులకు మాలలు వేస్తున్న, అర్చకులు సూర్య ప్రకాశ్‌శర్మ


గాంధీనగర్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార : ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధార దరి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ సెంటర్, కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరానికి మంచి స్పందన లభించింది. అనంతరం వైద్య శిబిరం కూడా నిర్వహించి రోగులకు మందులు, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ 14వ వార్డు అధ్యక్షుడు రాకేష్, అజయ్, వెంకట్, నాయుడు, నాగరాజు, రవి, శంకర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతు బజార్ ఖాళీ


సీతమ్మధార రైతుబజార్‌లో సరకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ గురువారం బోసిపోయింది. నిత్యం వేలాది మంది వినియోగదారులతో కిటకిటలాడే బజారు గురువారం ఉదయం ఖాళీగా దర్శనమిచ్చింది. పలు ప్రాంతాల్లో గురువారం శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభించారు. మరోవైపు ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధనలు కూడా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రైతుబజార్‌కి వినియోగదారుల తాకిడి గణనీయంగా తగ్గిపోయింది. కూరగాయల ధరలు పెరగడం కూడా ప్రభావం చూపిందనే చెప్పాలి. ముఖ్యంగా ఉల్లిపాయలు, టమాటా ధరలు మండిపోవడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు.

55వ వార్డులో ఆక్రమణలపై ఫిర్యాదు


వినతిపత్రం చూపుతున్న 55వ వార్డు ప్రజలు

సీతమ్మధార : జీవీఎంసీ 55వ వార్డులో ఆక్రమణల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము వార్డులోని ధర్మానగర్ శివాలయం వీధిలో నివసిస్తున్నామని, ఆ ప్రాంతంలో రోడ్ల మీద పాన్‌షాపులు, సోడా షాపులు, కార్ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు. రాకపోకలకు ఇబ్బందిగా వుందని ప్రశ్నిస్తే ఆక్రమణదారులు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంత జీవితం ముఖ్యం

బీచ్‌రోడ్డు: జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతతకు ఎక్కువ సమయం కేటాయించాలని ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు సూచించారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లోక కల్యాణార్థం ఆధ్యాత్మిక ఉత్సవం–దేవీ వైభవం పేరిట గురువారం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ దేవీ శరన్నవరాత్రులకు ఎంతో విశిష్టత ఉందన్నారు. దుర్గాదేవి అనుగ్రహం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రస్తుత జీవన ప్రయాణంలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. దేవాలయానికి వెళ్తే ఎంతో ప్రశాంతత లభిస్తుందని, మన పూర్వీకులు సైతం అమ్మవార్లను విశేషంగా కొలిచేవారని గుర్తుచేశారు. చేసే పనిలో నిజాయితీ ఉంటే లక్ష్యం కచ్చితంగా నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రోగ్రాం ఛైర్మన్ ఆర్జీఎస్ జగన్మోహన్, ప్రెసిడెంట్ బి.వినయగాంధీ, బి.మణిమాల, ఎం.కె.కుమార్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

- మత్తులో ఒంటరి మహిళలతో దురుసు ప్రవర్తన
- బెంబేలెత్తిపోతున్న జీవీఎంసీ 51, 52వ వార్డుల ప్రజలు
- పోలీసుల రాత్రి గస్తీ ఉన్నా ప్రయోజనం శూన్యం

మద్రిపాలెం : జీవీఎంసీ 51, 52వ వార్డుల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గంజాయ్ బ్యాచ్ రెచ్చిపోతోంది. జులాయిగా తిరిగే యువకులతో కూడిన ఈ బ్యాచ్‌లు నిత్యం గొడవలు, నేరాలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా ఒంటరిగా రోడ్లపైకి వచ్చేందుకు మహిళలు హడలిపోతున్నారంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనేక ఘటనల్లో స్థానిక కాలనీల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. గంజాయి నిర్మూలన పేరుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. చీకటి పడగానే వంశీనగర్, సీతన్న గార్డెన్స్, మాధవధార స్వామి ఆలయానికి వెళ్లే దారిలో గంజాయి మూకలు రెచ్చి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చీకటిపడగానే మత్తులోకి జారుకుంటూ...

వంశీనగర్ కమ్యూనిటీ హాల్ గోడకు ఆనుకుని వెనుకాల సుమారు ఏడు నుంచి 10 అడుగుల మేర స్థలం కూర్చునేందుకు వీలుగా ఉంది. ఆ స్థలానికి ఆనుకుని ఓ ప్రధాన గెడ్డ కూడా ఉంది. చీకటి పడగానే అక్కడకు కొంత మంది చేరుకుని గంజాయి, మద్యం సేవిస్తూ పక్కనే ఉన్న గెడ్డలో ప్యాకెట్లు, ఖాళీ సీసాలు విసిరేస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో కూతవేటు దూరంలో ఉన్న డీ మార్ట్ సూపర్ మార్కెట్ నుంచి వంశీనగర్ ప్రధాన గెడ్డకు వచ్చే దారిలో చీకటిలో చెట్ల మాటున కొందరు ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్లే ఒంటరి మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇటీవల స్థానికంగా ఓ మహిళను అలాగే వెంబడించడంతో ఆమె భయంతో ఇంటికి పరుగులు తీసింది. కొందరు జులాయిలకు గంజాయి మత్తు ఎక్కువైతే ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిని దారికాచి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మాధవ స్వామి ఆలయానికి వెళ్లేందుకు కూడా రాత్రి వేళల్లో భయపడుతున్నామని వాపోతున్నారు.

గంజాయి మత్తులో దొంగతనాలు

మరోవైపు వంశీనగర్ కాలనీలో బైకుల్లో నుంచి పెట్రోల్, ఇంటి ముందున్న బకెట్లు, దుస్తులు, ఏసీ పరికరాలు కూడా ఇటీవల అపహరణకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల వంశీనగర్ సాయిబాబా ఆలయ హుండీ పగలగొట్టేందుకు ఆకతాయిలు యత్నించినప్పటికీ... అదే సమయంలో స్థానికులు గణపతి నిమజ్జనోత్సవం ముగించుకుని వస్తుండడంతో చూసి పరుగులు తీశారు. మరోవైపు పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నా ఉపయోగం లేదని, వారు వచ్చే సమయానికి ఆకతాయిలు మాయమైపోతున్నారని స్థానికులు అంటున్నారు. మెయిన్ రోడ్డులో గస్తీ నిర్వహించడం వల్ల ఉపయోగం లేదని, పోలీసుల బైక్ శబ్దానికి గంజాయి బ్యాచ్ జారుకుంటున్నారని, అణువణువూ జల్లెడపట్టేలా గస్తీ నిర్వహించాలని కాలనీల వాసులు కోరుతున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


రాత్రి వేళల్లో గంజాయి, మద్యం సేవించేది ఇక్కడే

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


కప్పరాడలో నిరశన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం కప్పరాడ కొండవాలు ప్రాంతంలో గురువారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరశన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, సీపీఎం కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు పట్టణ ఉపాధి హామీ పథకం మంజూరు చేయాలని కోరారు. ఉచిత ఇసుక జీవోలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలన్నారు. ఉచిత ఇసుక విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడిచి సక్రమంగా సరఫరా చేస్తే కార్మికులకు పనులు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.చంటి, ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, కె.సత్యనారాయణ, రామునాయుడు పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ భేష్


రోల్‌బాల్ క్రీడాకారులతో సీఐ చంద్రశేఖర్

మురళీనగర్ : వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ ఆదర్శవంతంగా ఉందని ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. పార్కును ఆయన గురువారం సందర్శించారు. పార్కు అధ్యక్షుడు ననపల వరప్రసాద్ సందర్శకులకు, వాకర్స్‌కు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. స్విమ్మింగ్ పూల్, మట్టితో ఇటీవల నిర్మించిన అధునాతన వాకింగ్ ట్రాకు, స్కేటింగ్ రింగ్ నిర్వహణను సీఐకు వివరించారు. వీటిని ఆయన స్వయంగా పరిశీలించి నగరంలోని పార్కులన్నీ ఇదేవిధంగా నిర్వహించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్కులో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్కేటింగ్ చాంపియన్‌షిప్ విజేతలను సీఐ అభినందించారు. పార్కు కార్యాలయంలో నిర్వహణ కమిటీ సభ్యులతో భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర రోల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, తోట లలితకుమారి, కోచ్ పూసర్ల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన రిలే దీక్షలు


పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహారదీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆస్పత్రి ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం వద్దే సొంత నిధులు వేల కోట్ల రూపాయలు ఉన్నాయని, స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగరం ఇలా విస్తరించడానికి పోర్టు కూడా కారణమన్నారు. ప్రస్తుతం రూ.386 కోట్ల లాభాలతో నడుస్తోందని, సుమారు రూ.171.42 కోట్లు పన్నుల రూపంలో కడుతోందని తెలిపారు. పోర్టు హాస్పిటల్‌ను రక్షించుకునే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. రిలే నిరాహార దీక్షలో జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, బి.జగన్, కనకారావు, అప్పలనర్సమ్మ, ధనలక్ష్మి, పైడమ్మ, వీఎస్ మూర్తి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల్లో భయాందోళనలు తొలగించాలి

అగనంపూడి: కేంద్ర ప్రభుత్వం వైఖరి, ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యధోరణి వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, యు.రామస్వామి, పరంధామయ్య అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,330వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కార్మిక ప్రతినిధులతో కనీసం చర్చించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటుందన్నారు. దీని వల్ల ఆర్థిక నష్టం కల్గించడంతోపాటు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్‌లో అశాంతి, అలజడలకు కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పాటు యాజమాన్యం కూడా పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటూ నాయకులు కె.గంగాధర్, పెదిరెడ్ల నీలకంఠం, వి.ప్రసాద్, ఆర్.వెంకట్రావు, దత్తాత్రేయరాజు, కె.భానుమూర్తి, మధు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ తత్వంతోనే సమస్యలకు పరిష్కారం


సదస్సులో ఆచార్య ప్రసన్నకుమార్, ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

మద్దిలపాలెం: సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు గాంధీ తత్వంలోనే పరిష్కార మార్గాలు చూపవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని గాంధీ అధ్యయన కేంద్రంలో ఏయూ న్యాయ కళాశాల నిర్వహిస్తున్న ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ ఏ గాంధీయన్ పర్‌స్పెక్టివ్ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏయూ విశ్రాంత రెక్టార్ ఎ.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గాంధీజీ దేశ ప్రజలను ఐక్యం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన విధానాన్ని వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్ దాష్ మాట్లాడుతూ గాంధీజీలోని నాయకత్వ లక్షణాలు యువతకు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సత్యం, అహింసా, ఓర్పు అనే అంశాలను వివరించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహరావు, న్యాయ కళాశాల ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్య


కార్యక్రమంలో ధనుంజయరావు తదితరులు

మద్దిలపాలెం: పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఉపాధ్యాయులుగా బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం


మాట్లాడుతున్న ప్రభుత్వ మానసిక వైద్యాలయం వైద్యాధికారి రామిరెడ్డి

మహారాణిపేట: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ మానసిక ఆరోగ్య ఫెడరేషన్ పిలుపు నిచ్చిందని చిన వాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యాలయం ప్రధాన వైద్యాధికారి కె.వి. రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మానసిక ఆందోళనకు దూరంగా ఉండాలన్నారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.విజయలక్ష్మి , విశాఖ సైకియాట్రిక్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు మాట్లాడారు.